ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
30-09-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 28 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




## మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం..

- వారు బాగుంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది
- బ్రెస్ట్ క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన పెంచాలి
- 'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29:**

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో విజేతలను సీఎం రేవంత్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సంఘీభావంగా నగరవాసులు పింక్ పవర్ రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళల కోసం మరిన్ని ఆస్పత్రులను నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని, భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో ఈ రన్ నిర్వహించారు. విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఔత్సాహికులు.. దాదాపు 12 వేల మంది ఈ పరుగులో పాల్గొన్నారు. రన్‌లో భాగంగా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేందుకు పక్షి ఆకారంలో అతి పెద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ అంకుల్...




## మా ఇల్లు కూల్చొద్దు ప్లీజ్..
### రోడ్డెక్కి వేడుకున్న చిన్నారి!

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ వాసులను కూల్చివేతల భయం వెంటాడుతోంది. ముఖ్యంగా ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని ఇళ్లకు అధికారులు రెడ్ మార్క్ వేయడంతో.. భయంతో రోడ్డెక్కారు. తమ ఇళ్లను కూల్చొద్దని అధికారులను వేడుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలో కూల్చివేతలకు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. తాజాగా.. మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజలు రోడ్డెక్కారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఆందోళన చేపట్టారు. చిన్నారులు రోడ్డెక్కి.. ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేత పట్టుకుని నినాదాలు చేశారు. 'రేవంత్ అంకుల్ మా ఇల్లు కూల్చేయద్దు ప్లీజ్' అంటూ.. విజ్ఞప్తి చేశారు. చిన్నారుల నిరసనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఆందోళనలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. 'కొందరు అవకాశవాదులు రెచ్చగొడుతున్నారు. మూసీని పరిరక్షించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. పేదల ఇళ్లు పడగొట్టాలని ప్రభుత్వం చూడదు. రివర్ బెడ్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్నారు. మూసీ బాధితులకు

...మిగతాది 2 లో

## 'వికాస్.. విరాసత్'
### ప్రాముఖ్యతను నొక్కి చెప్పిన ప్రధాని మోదీ



2 లో

**ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకోనుంది. సెప్టెంబర్ 29, ఆదివారం తన మన్ కీ బాత్ 114వ ఎపిసోడ్ లో ప్రధాని మోదీ దేశ అభివృద్ధి, దేశ వారసత్వ పరిరక్షణ అంశాలపై ప్రసంగించారు. వాటి ప్రాముఖ్యతను వివరించారు.**

114వ 'మన్ కీ బాత్' రేడియో ప్రసంగ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ అభివృద్ధిని ప్రోత్సహిస్తూనే భారత దేశ వారసత్వాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన కీలక అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మన్ కీ బాత్ విజయాన్ని పరిశీలిస్తే.. దేశం గురించి సానుకూల పరిణామాలు, స్ఫూర్తిదాయకమైన కథలను ప్రజలు ఇష్టపడతారని 'మన్ కీ బాత్' నిరూపించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**'వికాస్ భీ, విరాసత్ భీ'**

114వ మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ దేశాభివృద్ధి, దేశ వారసత్వ పరిరక్షణ అంశాలను ఎంచుకున్నారు. ఇటీవల ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో ఆయన అమెరికా నుంచి 300 భారతీయ

## ఏపీకి తిరిగి వస్తున్న లులు
### పెట్టుబడులు పెట్టేందుకు గ్రీన్ సిగ్నల్



**జయభేరి, విజయవాడ :**

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు లులు సంస్థ ముందుకొచ్చింది. సీఎం చంద్రబాబుతో లులు సంస్థ ప్రతినిధులు శనివారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు లులు సంస్థను ఆహ్వానించారు. దీంతో ఈ సంస్థ ఏపీలో పెట్టుబడులపై ఆసక్తి చూపింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు లులు గ్రూప్ ముందుకొచ్చింది. సీఎం చంద్రబాబు

...మిగతాది 2 లో



## ఇళ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా..
### హైడ్రాపై బండి సంజయ్ ఫైర్

**జయభేరి, హైదరాబాద్ :**

హైడ్రాపై విమర్శలు రోజురోజూకు పెరుగుతున్నాయి. హైడ్రా విషయంలో ఇన్నాళ్లు సైలెంట్‌గా బీజేపీ.. ఇప్పుడు స్వరం పెంచుతోంది. తాజాగా కేంద్రమంత్రి బండి సంజయ్ హైడ్రాపై ఫైర్ అయ్యారు. రేవంత్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ.. విమర్శలు గుప్పించారు. బండి కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం, హైడ్రాపై కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ఏదో మార్పు తెస్తారని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే.. ప్రజలను గోస పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులకు.. ప్రస్తుత పాలకులకు తేడా లేదని విమర్శించారు.

...మిగతాది 2 లో

## హోంగార్డు మృతి..
### హైడ్రా బలి తీసుకుందనడం సరికాదు

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**జయభేరి, హైదరాబాద్ :**

ఇటీవల సంగారెడ్డి జిల్లాలో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అప్పుడు అపశ్రుతి జరిగింది. ఓ హోంగార్డుకు గాయాలయ్యాయి. అతను చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటనపై తాజాగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. అతన్ని హైడ్రా బలి తీసుకుందనడం సరికాదన్నారు. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామంలో పెద్ద చెరువు ఉంది. ఆ చెరువులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మూడు అంతస్తుల భవనాన్ని.. బాంబులతో కూల్చేశారు అధికారులు. అయితే.. కూల్చివేత సమయంలో శిథిలాలు తగిలి హోం గార్డ్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన చికిత్స పొందుతూ మృతిచెందారు. అయితే.. హోంగార్డును హైడ్రా బలి తీసుకుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

2 లో



## మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు..
### బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**జయభేరి, కరీంనగర్ :**

తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆర్టీసీ బస్సులను మహిళలకే అప్పగించాలని చూస్తుందా? మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో బస్సులు కొనుగోలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు రోడ్డెక్కాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ రూట్ లో 35 బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రారంభించారు. హైదరాబాద్ ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులనే నడపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు.



రాబోయే రోజుల్లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయిస్తామని.. అందుకు సమాలోచనలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఫ్రీ స్కీమ్ ప్రారంభించి

...మిగతాది 2 లో

## కేజీఎఫ్ ముందు పట్టదారుల నిరసన
### కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం అంటూ కేజీఎఫ్ వెంచర్ యజమాని సంతోష్ రెడ్డి

2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## 'వికాస్.. విరాసత్'

పురాతన కళాఖండాలను భారతదేశానికి తిరిగి తీసుకురావడం గురించి మాట్లాడారు. "అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చాలా ఆప్యాయంగా డెలావేర్లోని తన వ్యక్తిగత నివాసంలో ఈ కళాఖండాలను నాకు చూపించారు. వాటిని టెర్రకోట, రాయి, దంతాలు, కలప, రాగి, కంచు మొదలైన వాటితో తయారు చేశారు. ఆ కళాఖండాలను తిరిగి మన దేశానికి అందించారు. మన వారసత్వం పట్ల మనం చాలా గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంతరించిపోతున్న సంప్రదాయ భాషలను పరిరక్షించే విషయంపై కూడా ప్రధాని మోదీ ఈ మన్ కీ బాత్ లో మాట్లాడారు. "కొన్ని పురాతన భాషలు అంతరించిపోతున్నాయి. వాటిని ఇప్పుడు చాలా తక్కువ మంది ఉపయోగిస్తున్నారు. అలాంటి భాషల్లో మన 'సంతాలీ' భాష ఒకటి. డిజిటల్ ఇన్నోవేషన్ సాయంతో సంతాలీకి కొత్త గుర్తింపు ఇచ్చేందుకు క్యాంపెయిన్ ప్రారంభించాము" అని ప్రధాని తెలిపారు.
మన్ కీ బాత్ ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని భావోద్వేగంగా ప్రారంభించారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పదేళ్లు అయిందని, అప్పటి నుంచి ఎగుమతులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగాయని, తద్వారా స్థానిక తయారీదారులు వృద్ధి చెందడానికి వీలవుతోందని ఆయన పేర్కొన్నారు. నవరాత్రులతో ప్రారంభమయ్యే పండుగల సీజన్ గురించి ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఈ పండుగల్లో 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుపై ఒక చెట్టు)' కార్యక్రమం విజయవంతమైందని ప్రధాని మోదీ కొనియాడారు. స్వచ్ఛ భారత్ అభియాన్ గురించి, దాని విజయం గురించి ప్రస్తావిస్తూ, 'పునర్వినియోగం, రీసైకిలింగ్' ప్రాముఖ్యతను ప్రజలు గ్రహించడం ప్రారంభించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఘురారీ నదిని పునరుజ్జీవింపజేసిన ఝాన్సీ మహిళలను ప్రశంసించిన ప్రధాని మోడీ, స్వయం సహాయక సంఘాల విలువను నొక్కిచెప్పారు. గ్రామీణ స్థాయిలో జల సంరక్షణ ప్రయత్నాలకు మహిళలు నాయకత్వం వహించాలని, అందుకు వారు 'జల్ సహేలీ'గా మారాలనే పిలుపునిచ్చారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున నీటి సంరక్షణను నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన ఎత్తిచూపారు. మహాత్మాగాంధీ జయంతి అయిన అక్టోబర్ 2, స్వచ్ఛభారత్ అభియాన్ ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఉద్యమంలో పాల్గొన్న వారిని ప్రధాని మోదీ అభినందించారు.

## హోంగార్డు మృతి..

దీనిపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. 'కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దు. సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో హైడ్రా ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదు. హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదు. సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారు. సంగారెడ్డిలో హోంగార్డు గాయపడి చనిపోతే హైడ్రా బలి తీసుకుందనడం సరికాదు' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యాఖ్యానించారు. చంచల్‌గూడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఆదివారం రాత్రి సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చంచల్‌గూడలో కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌లను ఇస్తామని చెప్పింది. దీంతో ముందుగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్‌ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు గొడవకు దిగారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హైడ్రాను బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు సపోర్ట్ చేశారు. చెరువులో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అది నాగార్జున అయినా, రఘునందన్ రావు, ఎన్టీఆర్ అయినా సరే.. చెరువు కబ్జా చేస్తే కూలగొట్టేయాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు. అధికారులకు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. 'హైడ్రా పేరుతో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించకండి. సంగారెడ్డి నియోజకవర్గంలో కూల్చివేతల పేరిట అధికారులు అతుత్సాహం ప్రదర్శించకండి. హైడ్రా ఔటర్ రింగ్ రోడ్డు లోపలికే పరిమితం. ఏదైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి. నేను ముఖ్యమంత్రితో మాట్లాడుతా. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు హైడ్రా విషయంలో ఎలాంటి భయాందోళనలు అక్కర్లేదు.. నేను మీతో ఉన్నా' అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సోమవారం మూసీ పరివాహక ప్రాంత బాధితుల దగ్గరకు వెళ్లనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి.. మొదట రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్‌గూడలో పర్యటించనున్నారు. అనంతరం అత్తాపూర్‌లోని కిషన్ బాగ్ ప్రాంతాల్లోని మూసీ ప్రాజెక్ట్ వలన నష్టపోతున్న ప్రజలను కలవనున్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై మాజీమంత్రి హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రేవంత్ రెడ్డి సుద్దపూస లెక్క మాట్లాడుతున్నారు. కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కుంటలో ఉంది. సర్వే నంబర్ 1138 రెడ్డికుంటలో సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ఉంది. అతని తమ్ముడి ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. ముందు మీ ఇండ్లు కూల్చుకోండి.. తర్వాత పేద ప్రజల దగ్గరికి రండి' అని హరీష్‌రావు వ్యాఖ్యానించారు.

## మా ఇల్లు కూల్చొద్దు ప్లీజ్..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నాం. పేదల సొంతింటి కల నెరవేరుస్తాం. పేదలకు పక్కా ఇళ్లు ఇస్తున్నాం' అని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. హైడ్రా కూల్చివేతలపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. '6 గ్యారంటీలు చూసి ప్రజలు మీకు ఓటేశారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పారు.. ఇళ్లు కూల్చడం ఇందిరమ్మ రాజ్యమా.. రుణమాఫీ చేయకపోవడం ఇందిరమ్మ రాజ్యమా.. ఉద్యోగులను మోసం చేయడం ఇందిరమ్మ రాజ్యమా.. మహిళలను మోసం చేయడం ఇందిరమ్మ రాజ్యమా.. ఇళ్లు కోల్పోయిన పేదలను చూస్తే ఆవేదన కలుగుతోంది. ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకునే వారి ఇళ్లను కూలుస్తారా' అని బండి సంజయ్ ప్రశ్నించారు. హైడ్రా కూల్చివేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. పేదలను ముందు పెట్టి బిల్డర్స్ ఇష్యూ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఎఫ్‌టీఎల్‌లో కట్టుకున్న ఇళ్లే కూల్చేస్తున్నామని వివరించారు. బఫర్ జోన్‌లో ఉన్నవాటిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. 'రేవంత్‌రెడ్డిది రాతి గుండె. మీకో రూల్.. పేదలకు మరో రూలా. మూసీ ప్రాంత వాసులకు అండగా ఉంటాం. అవసరమైతే రోజుకో ఎమ్మెల్యే ఇక్కడే ఉంటాం. బుల్డోజర్లు మమ్మల్ని దాటుకుని రావాల్సిందే. నోరెత్తని పేదలకు నోటీసులు ఇస్తున్నారు. బాధితుల తరపున కోర్టు నుంచి స్టే ఆర్డర్‌లు తెస్తాం. ఎప్పుడొచ్చినా తెలంగాణ భవన్ తలుపులు తెరిచే ఉంటాయి' అని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు.

## మహిళా.. ఆర్టీసీ బస్సులు

300 రోజులు అవుతుందని చెప్పారు. రూ.3200 కోట్ల వ్యయం కాగా.. 92 కోట్ల మంది మహిళలు ఫ్రీగా ప్రయాణం చేశారని వివరించారు. గతంలో 15 వేల ఆర్టీసీ బస్సులు ఉంటే.. గత పాలకుల నిర్లక్ష్యంతో 9500 తగ్గాయని మంత్రి పొన్నం ఆరోపించారు. ఫ్రీ బస్ సౌకర్యంతో బస్సులు కావాలనే డిమాండ్ ప్రస్తుతం ఉందన్నారు. నూతనంగా ఆర్టీసీప్రభుత్వ భాగస్వామ్యంతో బస్సులు కొనుగోలు చేస్తుందన్నారు. మహిళా సమాఖ్యలు, మెప్మా ద్వారా బస్సులు కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీలో ఉద్యోగుల భర్తీ, కార్మికులకు పీఆర్సీ, కారుణ్య నియామకాల సమస్యలన్ని దసరా లోపు పరిష్కరిస్తామన్నారు. ఆర్టీసీలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లో ఎలక్ట్రిక్ బస్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. హైదరాబాద్ రింగ్ రోడ్డు లోపల ఒక్క డిజిల్ బస్ కూడా ఉండకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నామని వివరించారు. పర్యావరణ పరిరక్షణ, సౌండ్ పొల్యూషన్ లేకుండా హైదరాబాద్ ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. జేబీఎం సంస్థతో ఆర్టీసీ ఒప్పందం చేసుకొని.. తొలివిడతగా కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రికల్ సూపర్ లగ్జరీ బస్సులను మంజూరు చేయగా.. అందులో 35 హైదరాబాద్ రూట్లో ప్రారంభించామని చెప్పారు. ఈ బస్సులు అద్దె ప్రాతిపాదికన నడుస్తాయని, ఆపరేషన్ అండ్ పర్యవేక్షణ ఆర్టీసీ చూసుకుంటుందని మంత్రి తెలిపారు. 12 మీటర్ల పొడవు గల ఎలక్ట్రికల్ సూపర్ లగ్జరీ బస్సులు.. పూర్తిగా ఎలక్ట్రిక్ బ్యాటరీలతో ఆపరేట్ అవుతాయని, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టంతో ముందు, వెనుక పూర్తి ఎయిర్ బ్రేక్ సిస్టం ఉంటుందని వివరించారు. ప్రయాణికుల భద్రత కోసం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. 41 సీట్ల సామర్థ్యం ఉన్న బస్సులో.. కరీంనగర్ నుంచి హైదరాబాదుకు పెద్దలకు రూ.330, పిల్లలకు రూ.200 ఛార్జి వసూలు చేస్తారని వివరించారు. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేసే ప్రసక్తే లేదని సంస్థ ఎండి సజ్జనార్ స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థ ఆపరేటింగ్ చేస్తున్నప్పటికీ.. ఆర్టీసీ కంట్రోల్ లోనే నడుస్తాయని తెలిపారు. బస్సుల ఛార్జింగ్ కోసం కరీంనగర్ 2 డిపోతో పాటు వరంగల్, నిజామాబాద్, నల్గొండ, హైదరాబాద్ 2, సూర్యాపేట డిపోలలో పాయింట్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలో 500 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని సజ్జనార్ తెలిపారు.

# సీతారాం యేచూరి స్థానంలో సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ కరత్

**పార్టీ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నేత ప్రకాశ్ కరత్ ను సీపీఎం నియమించింది. ఈ పదవిలో ప్రకాశ్ కరత్ వచ్చే సంవత్సరం ఏప్రిల్ వరకు ఉంటారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీతారాం యేచూరి ఆకస్మిక మరణం నేపథ్యంలో ప్రకాశ్ కరత్ ను ఆ పదవిలో నియమించారు.**





సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ కరత్‌ను పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఆయన ఏప్రిల్ వరకు ఆ బాధ్యతల్లో ఉంటారు. ఇటీవల (సెప్టెంబర్ 12న) అనారోగ్యంతో మరణించిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్థానాన్ని తాత్కాలికంగా ప్రకాష్ కరత్‌తో భర్తీ చేస్తున్నారు. ఈ మేరకు ఆపార్టీ నిర్ణయాధికార కమిటీ నిర్ణయం తీసుకుంది.

**కేంద్ర కమిటీ సమావేశాలు**

రెండు రోజుల పాటు జరిగే సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలు ఆదివారం ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ (హెచ్‌కేసీ)లో ప్రారంభం అయ్యాయి. ఈ సమావేశాల్లో పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ కరత్‌ను కేంద్ర కమిటీ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. "ఢిల్లీలో జరుగుతున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) సెంట్రల్ కమిటీ 24వ పార్టీ మహాసభ జరిగే వరకు (2025 ఏప్రిల్‌లో మధురైలో) సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్‌ను పొలిట్ బ్యూరో, అలాగే సెంట్రల్ కమిటీకి సమన్వయకర్తగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. సీపీఎం ప్రస్తుత జనరల్ సెక్రటరీ కామ్రేడ్ సీతారాం ఏచూరి విచారకరమైన, ఆకస్మిక మరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది" అని ఆ ప్రకటనలో సీపీఎం కేంద్ర కమిటీ కార్యాలయం తరపున ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్ పేర్కొన్నారు.

**పదేళ్ల పాటు ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కరత్**

సీపీఎం నేత ప్రకాష్ కరత్ ఇప్పటికే పదేళ్ల పాటు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1948 ఫిబ్రవరి 7న నాటి బర్మా (మయన్మార్)లోని లేత్‌పదన్‌లో నాయర్ కుటుంబంలో ప్రకాశ్ కరత్ జన్మించారు. ఆయన సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్‌ను వివాహం చేసుకున్నారు. జేఎన్‌యూలో ఎస్ఎఫ్ఐలో పని చేస్తూనే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) సీపీఎంలో చేరారు. 198285 మధ్య సీపీఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ప్రకాష్ కరత్, 1985లో సీపీఎం కేంద్ర కమిటీలోకి ఎన్నిక అయ్యారు. ఆ తరువాత 1992లో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నిక అయ్యారు. 2005లో ఢిల్లీలో జరిగిన సీపీఎం 18వ మహాసభలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు. అప్పటి నుంచి పదేళ్ల పాటు ప్రకాష్ కరత్ సీపీఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నారు. 2015లో ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగిన సీపీఎం 21 మహాసభలో ప్రకాష్ కరత్ ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి తప్పుకున్నారు. ఆ మహాసభలో సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యారు.

**మయన్మార్ లో జననం**

1948 ఫిబ్రవరి 7న నాటి బర్మా (మయన్మార్) లోని లేత్‌పదన్‌లో నాయర్ కుటుంబంలో ప్రకాష్ కరత్ జన్మించారు. ఆయన తండ్రి బర్మా రైల్వేస్‌లో క్లర్క్‌గా పని చేశారు. ప్రకాష్ కరత్ కుటుంబం కేరళలోని పాలక్కాడ్‌లోని ఎలప్పుజికి చెందినది. అక్కడే ఐదేళ్ల పాటు ఉన్న ప్రకాష్ కరత్, ఆ తరువాత బర్మాకు వెళ్లి తొమ్మిదేళ్ల వయస్సు వరకు తన కుటుంబంతో అక్కడే ఉన్నారు. కరత్ చెన్నైలోని మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చదువుకున్నారు. పాఠశాల చదువు పూర్తి అయ్యాక, టోక్యో ఒలింపిక్స్‌పై అఖిల భారత వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఫలితంగా 1964లో టోక్యో ఒలింపిక్స్‌కు పది రోజుల పర్యటనకు వెళ్లారు. ఆయన చెన్నైలోని మద్రాసు క్రిస్టియన్ కాలేజీకి అర్థశాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థిగా వెళ్లారు. గ్రాడ్యుయేషన్‌లో ఉత్తమ ఆల్ రౌండ్ విద్యార్థిగా మెడల్‌ను గెలుచుకున్నారు.

**ఎడిన్‌బర్గ్ యూనివర్శిటీలో మాస్టర్స్**

కాలేజీ ప్రొఫెసర్లలో ఒకరైన స్కాటిష్ వేదాంతవేత్త డంకన్ బి.ఫారెస్టర్ ప్రకాష్ కరత్‌ను ప్రోత్సహించేవారు. ఆ ప్రోత్సహంతోనే రాజకీయాల్లో మాస్టర్స్ డిగ్రీ కోసం బ్రిటన్‌లోని ఎడిన్‌బర్గ్ యూనివర్శిటీలో స్కాలర్‌షిప్ పొందారు. 1970లో "ఆధునిక భారతదేశంలో భాష, రాజకీయాలు" అనే థీసిస్‌లో ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుండి ఎంఎస్‌సీ పట్టా పొందారు. ఎడిన్‌బర్గ్‌లో ఆయన విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలకంగా మారారు. ప్రసిద్ధ మార్క్సిస్ట్, చరిత్రకారుడు ప్రొఫెసర్ విక్టర్ కీర్నాన్‌ను కలిశారు. ప్రకాష్ కరత్ రాజకీయ కార్యాచరణ యూనివర్శిటీలో వర్ణవివక్ష వ్యతిరేక నిరసనలతో ప్రారంభమైంది. దీంతో ఆయనను సస్పెండ్ చేశారు.

**జేఎన్యూ లో పీహెచ్డీ**

1970లో భారత దేశానికి తిరిగి వచ్చిన ప్రకాష్ కరత్, న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జేఎన్‌యూ)లో చేరారు. ఆయన పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు 1971 నుండి 1973 వరకు పార్లమెంట్‌లో సీపీఎం నేత, కేరళకు చెందిన లెజెండరీ కమ్యూనిస్టు నేత ఏకే గోపాలన్‌కు సహాయకుడిగా ఉన్నారు. జేఎన్‌యూలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SFI) వ్యవస్థాపకుల్లో ప్రకాష్ కరత్ ఒకరు. ఆయన జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**ఎస్ఎఫ్ఐ అధ్యక్షత**

197479 మధ్య ఎస్ఎఫ్ఐ రెండో సారి అధ్యక్షుడు అయ్యారు. ఈ కాలంలో ప్రకాష్ కరత్‌కు సహచరులు ఎన్.రామ్ (తరువాత ది హిందూ దినపత్రి చీఫ్ ఎడిటర్), మైథిలీ శిరామన్ ఉన్నారు. అలాగే పి. చిదంబరం కూడా ప్రకాష్ కరత్‌కు సన్నిహితంగా ఉండేవారు. పి. చిదంబరం తరువాత కేంద్ర ఆర్థిక మంత్రి అయ్యారు. 197576లో దేశంలో ఎమర్జెన్సీ సమయంలో ఏడాదన్నర కాలంలో అజ్ఞాతవాసంలో ఉన్నారు. ప్రకాష్ కరత్ రెండు సార్లు అరెస్టు అయ్యారు. ఎనిమిది రోజులు జైలులో ఉన్నారు.

# కేజీఎఫ్ ముందు పట్టదారుల నిరసన

▶▶ కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం అంటూ కేజీఎఫ్ వెంచర్ యజమాని సంతోష్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం అంకిరెడ్డి పల్లి గ్రామ కంఠం లోని కేజీఎఫ్ హెచ్ఎండిఏ వెంచర్ ముందు ఆదివారం అదే గ్రామానికి చెందిన కొందరు పట్టదారులు ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే కీసర మండలం అంకిరెడ్డి పల్లి గ్రామం సర్వే నెంబర్ 811,812 అండ్ 813,814,815 లలో 18 ఎకరాల 20 గుంటల భూమిని అప్పనంగా గత 50 సంవత్సరాల కాలంలో తాత ముత్తాతలు సంపాదించిన భూమిని పాత పహానిలో పేర్లు లెకుండా చేసి తమ పేర్లపై చేసుకుని దర్జాగా కేజీఎఫ్ అనే పేరుతో వెంచర్ చేసి ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్న వెంచర్ యజమానిని స్థానిక గ్రామ భాదితులు ఎన్నో పరియాయలు మెరపెట్టుకున్నా, కలెక్టర్ దృష్టి తీసుకెళ్లినా లాభం లేకపోవడంతో బాధితులు కోర్టులో స్టేటస్ కో వేయడంతో గత 2007 సంవత్సరంలో భాదితులు అనుకూలంగా తీర్పు రావడంతో కుదేల్ ఐనా యజమాని రాజకీయ నాయకుడి అండదండలతో స్థానిక మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అండతో వెంచర్ యజమాని లెక్కచేయకకుండా భాదితులు పట్టించుకోక పోవడంతో.. అంకిరెడ్డిపల్లి భాదితులు మాట్లాడుతూ.. ఎప్పుడూ మా చిన్నప్పుడు మా తాతల ఆస్తి అప్పట్లో అమ్ముకున్నారు. కానీ ఇప్పుడు మా సంతకాలు కూడా లేవు? అందుకే కోర్టులో కేసు వేయడం జరిగింది. ఇప్పుడు ఇట్టి విషయంపై మాకు కోర్టులో స్టేటస్ కో వచ్చింది. ఎన్ని సార్లు వెంచర్ యజమానికి చెప్పిన పట్టించుకోవడం లేదు అని అన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న వారిని అక్కడి నుండి పంపించారు. వెంచర్ చేసిన సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. మేము అంకిరెడ్డి పల్లీ గ్రామానికి చెందిన పట్టదారుల భూమి నేరుగా కొనలేదు. మేము వారి దగ్గర కొన్న సత్య సాయి ట్రస్ట్ పట్టాదారు జనకి రాములు వరుసల దగ్గర కొన్నమని అన్నారు. అయిన హెచ్ఎండిఏ అనుమతితో లె ఔట్ చేయడం జరిగింది. ఇప్పుడు అమ్మిన పట్ట దారుల వారసులు ఇలా చేయడం సరికాదు అని అన్నారు. ఒక్కవేళ కోర్టు ఏ విధంగా చెపితే వారి ఆదేశాలు మేము పాటిస్తం అని అన్నారు.

## ఏపీకి తిరిగి వస్తున్న లులు

సామాజిక మాధ్యమం ఎక్స్ లో ఈ విషయాన్ని పంచుకున్నారు. సీఎం చంద్రబాబుతో లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీ శనివారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో లులు గ్రూప్‌ను సీఎం చంద్రబాబు ఏపీకి ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంతో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ పచ్చ జెండా ఊపింది. లులు గ్రూప్ ఏపీకి తిరిగివచ్చినందుకు సంతోషిస్తున్నానని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు లులు సంస్థ సిద్ధంగా ఉందన్నారు. ఈ సంస్థకు అవసరమైన సహకారం అందజేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలో లులు ప్రణాళికలపై చర్చించామన్నారు. లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ ఆలీతో ఏపీ ప్రభుత్వ చర్చలు సఫలం అయ్యాయని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖలో లులు మాల్, మల్టీప్లెక్స్, విజయవాడ, తిరుపతిలో హైపర్ మార్కెట్, మల్టీప్లెక్స్ ఏర్పాటుకు ఈ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేశారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో పాల్గొనే భాగస్వాముల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. లులు గ్రూప్ ను ఏపీకి తిరిగి స్వాగతించేందుకు తాను సంతోషిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. లులు ఛైర్మన్ యూసుఫ్ ఆలీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రఫ్ అలీ బృందం అమరావతిలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ భేటీలో పెట్టుబడుల అంశంపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులతో పాటు వైజాగ్‌లో మాల్ మల్టీప్లెక్స్, హైపర్‌మార్కెట్, విజయవాడ, తిరుపతిలో మల్టీప్లెక్స్‌ల ప్రణాళికలను లులు బృందంతో చర్చించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపీ ప్రభుత్వం సాధ్యమైన ప్రతి సహకారం, మద్దతును అందిస్తుందన్నారు. తన మిత్రుడైన యూసఫ్ అలీ ప్రయత్నాలలో మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఫలవంతమైన భాగస్వామ్యం కోసం ఎదురు చూస్తున్నానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి జీవీఆర్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్, సీఎమ్ఆర్ గ్రూప్ విరాళం అందించాయి. జీవీఆర్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ తరపున ఆ సంస్థ ప్రతినిధులు రామచంద్రరాజు, గంగాప్రసాద్ రూ.1 కోటి,. సీఎమ్ఆర్ గ్రూప్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ రూ.50 లక్షల విరాళంను సీఎం చంద్రబాబు నాయుడుని శనివారం ఉండవల్లి నివాసంలో కలిసి అందించారు.

## ఇళ్లు కూల్చడమే...

తీరు మార్చుకోకపోతే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. '6 గ్యారంటీలు చూసి ప్రజలు మీకు ఓటేశారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పారు.. ఇళ్లు కూల్చడం ఇందిరమ్మరాజ్యమా.. రుణమాఫీ చేయకపోవడం ఇందిరమ్మరాజ్యమా.. ఉద్యోగులను మోసం చేయడం ఇందిరమ్మరాజ్యమా.. మహిళలను మోసం చేయడం ఇందిరమ్మ రాజ్యమా.. ఇళ్లు కోల్పోయిన పేదలను చూస్తే ఆవేదన కలుగుతోంది. ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకునే వారి ఇళ్లను కూలుస్తారా' అని బండి సంజయ్ ప్రశ్నించారు. 'కిరాయి ఉన్నవారిని రాత్రికి రాత్రే ఖాళీ చేయించి ఇళ్లు కూల్చేస్తారా.. ఇదేం పరిపాలన. కాంగ్రెస్ కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నది. హైడ్రా కారణంగా తెలంగాణ ఆర్థిక పరిస్థితి దిగజారింది. ఇంత ప్రజా వ్యతిరేకత ఉన్నా.. హైడ్రాను కొనసాగించడం కరెక్ట్ కాదు. భారతీయ జనతా పార్టీ దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తోంది' అని బండి సంజయ్ స్పష్టం చేశారు. హైడ్రా కూల్చివేతలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. పేదలను ముందు పెట్టి బిల్డర్స్ ఇష్యూ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఎఫ్‌టీఎల్‌లో కట్టుకున్న ఇళ్లే కూల్చేస్తున్నామని వివరించారు. బఫర్ జోన్‌లో ఉన్నవాటిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. 'రేవంత్‌రెడ్డిది రాతి గుండె. మీకో రూల్.. పేదలకు మరో రూలా. మూసీ ప్రాంత వాసులకు అండగా ఉంటాం. అవసరమైతే రోజుకో ఎమ్మెల్యే ఇక్కడే ఉంటాం. బుల్డోజర్లు మమ్మల్ని దాటుకుని రావాల్సిందే. నోరెత్తని పేదలకు నోటీసులు ఇస్తున్నారు. బాధితుల తరపున కోర్టు నుంచి స్టే ఆర్డర్‌లు తెస్తాం. ఎప్పుడొచ్చినా తెలంగాణ భవన్ తలుపులు తెరిచే ఉంటాయి' అని మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించారు.
ఇటు హైడ్రాపై కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా విమర్శలు చేస్తున్నారు. హైడ్రా తీరును తప్పుబడుతున్నారు. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పేదల ఇళ్లను కూల్చడం సరికాదు. మూసీ నిర్వాసితులకు కౌన్సిలింగ్ ఇవ్వాల్సింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఖాళీ చేయించాల్సింది. కూల్చిన ఇళ్లకు సమీపంలోనే నివాసం ఏర్పాటు చేస్తే మంచిది. మూసీ ప్రక్షాళన అవసరం ఉంది. భవిష్యత్తులో మూసీ విపత్తు పరిణామాల నుంచి ప్రజలకు ఇబ్బందుల కలగొద్దని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. పేదల ఇళ్ల కూల్చివేత అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా' అని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.

## రేవంత్ రెడ్డి సర్కార్, కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎంతమంది..

# పేదల కళ్ళలో మట్టి కొడుతుంది

- ఎంతమంది జీవితాలను బుగ్గిపాలు చేస్తుంది
- తేల్చుకునే సందర్భం వచ్చింది
- దీనికి మూల్యం చెల్లించక తప్పదు
- నీయబ్బ జాగీరా అని అడుగుతున్నాం
- నీకేమీ అధికారం 50 ఏళ్ల ఇవ్వలేదు
- కేసీఆర్ కూడా ఇలానే విర్ర వీగాడు ఏమయ్యాడు
- దెబ్బ కొడితే దిమ్మ తిరిగింది
- పేదల బ్రతుకుల్లో మట్టి కొడితే వారి ఉసురు తగలకపోదు
- పేదలకు అండగా ఉంటాం.. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్.




**జయభేరి, మేడ్చల్ :**

మల్లంపేటలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్. రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న పాపానికి హైదరాబాదులో ఉన్న పేదల కాలనీలలో కంటిమీద కునుకు లేకుండా పోయింది. చెర్లపక్కన ఉన్నాయని, ప్రభుత్వ భూముల్లో ఉన్నాయని పేదల ఇళ్లను కూలగొడుతున్నారు. 50 ఏళ్లుగా పొట్టచేత పట్టుకుని తెలంగాణ పల్లెల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ కు వచ్చి బ్రతుకుతున్న వారిని చెల్లాచెదురు చేస్తున్నారు. కరెంట్ బిల్లులు, నల్ల బిల్లులు, టాక్స్ లు కడుతున్నారు. జీవో 58, 59 కింద రెగ్యులరైజేషన్ కూడా చేసుకున్నారు. కొన్ని ప్రభుత్వాలు అధికారికంగా పట్టాలు కూడా ఇచ్చాయి. ఆ పేదల ఇళ్లపై హైడ్రా పేరిట చెప్పకుండా శనివారం ఆదివారం అయితే కోర్టులు ఉండవని వచ్చి కూలగొడుతున్నారు. ప్రతినిత్యం మా ఇంటి దగ్గర వందల మంది వచ్చి ఏడుస్తున్నారు. రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న పాపానికి హైదరాబాదులో ఉన్న పేదల కాలనీలలో కంటిమీద కునుకు లేకుండా పోయింది. అయ్యా నా కొడుకుకు క్యాన్సర్ వచ్చింది. వాటర్ ప్యాకెట్లు అమ్ముకుని బతుకుతున్న.. ఈ భూమి నాది కాదు.. సామాను తీసుకోనివ్వండి అన్నా కనికరించకుండా కూలగొట్టారు. సొంత కాళ్ళ మీద నిలబడేందుకు..నల్ల చెరువులో పక్కన పట్టా భూమిని లీజుకు తీసుకుని షెడ్డు వేసుకొని క్యాటరింగ్ పెట్టుకుంటే కూలగొట్టారు. వాళ్ళ అమ్మ మూడు గంటల టైం ఇవ్వండి, మా సామాను తీసుకుంటాము అని కాళ్ళ మీద పడ్డా కనికరించకుండా కళ్ళముందే.. చెమట పైసలతో నిర్మించుకున్న షెడ్లను, సామాన్లు ధ్వంసం చేశారు. కుటుంబమంతా 30 ఏళ్లు కష్టపడి ఒక ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్ కొనుక్కొని షాపు పెట్టుకుంటే, షెడ్డు కూలగొట్టడమే కాదు ఆ ఫ్లెక్సీ మిషన్ మీద డోజర్ ఎక్కించి ధ్వంసం చేశారు అంటే ఎంత క్రూరంగా వ్యవహరిస్తున్నారు ఆలోచన చేయండి. హైదరాబాదులో ఏ పేదవాళ్లు కూడా నిద్రపోవటం లేదు. ఈ పేద వాళ్ళ బాధను పేపర్లు రాయడం లేదు, టీవీలు చూపించడం లేదు. రేవంత్ రెడ్డి సర్కార్, కాంగ్రెస్ పార్టీ ఎంతమంది పేదల కళ్ళలో మట్టి కొడుతుంది. ఎంతమంది జీవితాలను బుగ్గిపాలు చేస్తుంది. ఎంతమంది జీవితాలతో ఆడుకుంటుంది. తేల్చుకునే సందర్భం వచ్చింది.

9 నెలల్లోనే ఆయనేంటో తేలిపోయింది. రేవంత్ రెడ్డి వస్తే మహిళలకు 2500 రూపాయలు, చదువుకునే ఆడపిల్లకు స్కూటీ, కళ్యాణ లక్ష్మికి తులం బంగారం, 4వేల పెన్షన్లు, 6 వేల పెన్షన్లు వస్తాయి అనుకున్నారు ఏవి రాలేదు. కానీ పేదల ఇల్లు మాత్రం కూలిపోతున్నాయి. దీనికి మూల్యం చెల్లించక తప్పదు నీయబ్బ జాగీర అని అడుగుతున్నాం. నీకేమీ అధికారం 50 ఏళ్ల కోసం ఇవ్వలేదు. మీ బ్రతుకు ఐదేళ్ల కోసమే. కేసీఆర్ కూడా ఇలానే విర్ర వీగాడు ఏమయ్యాడు. దెబ్బ కొడితే దిమ్మ తిరిగింది. ఇంకా ఉంటే మూడేళ్లు ఉంటారు. పేదల బ్రతుకులు మట్టి కొడితే వారి ఉసురు తగలకపోదు. పేదవాళ్లు ఏడుస్తుంటే ఎంపీగా నువ్వు ఏం చేస్తున్నావు ఈటల రాజేందర్ అంటూ అమెరికా నుంచి ఫోన్ చేస్తున్నారు. మాకే బాధనిపిస్తుంది మీకు అనిపించడం లేదా అని అడుగుతున్నారు. భారతీయ జనతా పార్టీ పేదలకు అండగా ఉంటుంది. దౌర్జన్యాలు దుర్మార్గాలు జరిగితే అడ్డంగా ఉంటుంది. ఇచ్చిన హామీ అమలు చేయకపోతే ముక్కు పిండి మీ పక్షాన నిలిచి వసూలు చేస్తాము.



## భూ బకాసురు కనుసైగలో...

**జయభేరి, జడ్చర్ల :**

జడ్చర్ల ప్రేమ్ రంగా గార్డెన్ లో చర్మకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా బీసీ సేన నాయకులు బి శివకుమార్, డి శివకుమార్ రాజేందర్ గౌడ్, వెంకటయ్య గౌడ్ లంబాడెక్కుల పోరాట సమితి ఝాన్సీరాం నాయక్, గోపాల్ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొని పోలేపల్లిలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయంలో2003 సంవత్సర మున 25 ఎకరాల భూమిని లెదర్ మినీ లెదర్ పార్కును కోసమని కేటాయించినరు. ఇట్టి భూమి భూ బకాసురు కనుసైగలో గడిచిన పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో కూడా మాజీ మంత్రిని కలిసిన మాకు న్యాయం జరగక పోయింది. కనుక ఇప్పటి ప్రభుత్వం అయినా మాకు సరైన న్యాయం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో చర్మకారుల సంక్షేమ సంఘం జడ్చర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మాచారం కృష్ణయ్య, వెంకటయ్య గౌడ్, బి శివకుమార్, రాజేందర్ గౌడ్, గాంచిరామ్ తదితరు పాల్గొని ఒక వినతి పత్రం సార్ కి ఇచ్చినాము.

## పతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం శివ సాయి గార్డెన్ నాగారంలో జరిగిన పోలీస్ రంగారెడ్డి (గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు) పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కుషాయిగూడ హెడ్ మాస్టర్ గా సేవలు అందించిన రంగారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారు అని ఆయన అన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషిచేశాడు అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, MEO, BRS పార్టీ నాయకులు మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 29:**

టిపిసీసీ కార్యదర్శి, తెలంగాణ ఎన్నారై సెల్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ ఐజాజ్ ఉజ్ జమాన్ శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నల్లమాద పురుషోత్తంరెడ్డి అనే గొప్ప వ్యక్తినీ కోల్పోయాం అని ఆదివారం తన మీడియా ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉత్తమ్ తండ్రి. పురుషోత్తం రెడ్డి లేని లోటు తీరని లోటు. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన క్రమశిక్షణను తండ్రి నుండీ అలవర్చుకొన్నారు. తన కఠినమైన క్రమశిక్షణతో ఉత్తమ్ కుమార్ రెడ్డి నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరారు మరియు రాజకీయ రంగంలో దృఢమైన రాజకీయ నాయకుడిగా నిలిచారు. మరియు ఉన్నత స్థానానికి ఎదిగారు. పుర్షోత్తం రెడ్డి లేకుండా ఉండటం ఉత్తమ్ కుటుంబానికి పూడ్చలేని లోటు అని డాక్టర్ ఐజాజ్ ఉజ్ జమాన్ అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.

## పోలీసులు అదుపులో ఇద్దరు వ్యక్తులు



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 29:**

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇంటి దగ్గర రెక్కీ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఆదివారం నాడు గోషామహల్లోని ఎమ్మెల్యే ఇంటి వద్ద షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాజా అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని స్థానికులు పట్టుకుని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వాళ్లు ఎమ్మెల్యే ఇంటిపై రెక్కీ నిర్వహించేందుకు వచ్చినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. హుటాహుటిక అక్కడకు చేరుకున్న మంగళ్ హాట్ పోలీసులు నిందితులను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. కాగా.. ఇద్దరి మొబైల్ ఫోన్లలో రాజాసింగ్ ఫోటోలు, గన్, బుల్లెట్ల ఫోటోలు ఉండడంతో రాజాసింగ్పై దాడి చేయడానికి వచ్చారా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# బిజేపి సభ్యత్వ నమోదు

- గజ్వేల్ నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జ్ కోదాండం శ్రీనివాస్

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 29 :**

రాబోవు ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని గజ్వేల్ నియోజకవర్గ సభ్యత్వ ఇంచార్జ్ కోదాండం శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు కుడికల రాములు తెలిపారు. ములుగు మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన ములుగు మండలంలో ప్రతి బూత్ లో 200 సభ్యత్వాలు చెయ్యాలని సూచించారు. సార్వత్వ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, కో కన్వీనర్ సత్యనారాయణ యాదవ్, మండల ఉపాధ్యక్షులు కొండు నర్సింలు ముదిరాజ్, బట్టు ఎలేందర్ రెడ్డి, మహేష్, మండల ప్రధాన కార్యదర్శిలు బద్రి, భాస్కర్, హరికృష్ణ, మండల కిసాన్ మోర్చ అధ్యక్షుడు పల్లె నవీన్ ఎస్టీ మోర్చా అశోక్ దత్తు వివిధ మోర్చా అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జిలు బుత్ అధ్యక్షులు పాల్గొనడం జరిగింది.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలో గల విద్యోదయ పబ్లిక్ స్కూల్ 2001 2002 సంవత్సరము 10 వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం విద్యార్థులు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వనం చంద్రమౌళి ఉపాధ్యాయులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రధాన ఉపాధ్యాయులు కలీమ్ సార్ మాట్లాడుతూ.. ఒక్కొక్కరు ఒక్కో స్థాయిలో గవర్నమెంట్ ఉద్యోగాలు సంపాదించినందుకు చాలా సంతోషంగా ఉందని అభినందించినారు. కరస్పాండెంట్ రామకృష్ణ సార్ మాట్లాడుతూ నేను ఎప్పుడు కూడ అనుకోలేదు ఇంత మంచి ప్రోగ్రాం జరుగుతది అని మా యొక్క పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థులు అందనంత ఎత్తుకు ఏదిగిపోయారు అని మాకు చాలా గర్వంగా ఉంది అని అన్నారు ఉపాధ్యాయునికి విద్యార్థులు ఉన్నతమైన స్థానంలో ఉన్నప్పుడు కలిగే ఆనందం చాలా ముచ్చటగా ఉంటుందని తెలియజేసినారు. పదవ తరగతి చెప్పినటువంటి ప్రతి యొక్క ఉపాధ్యాయులు రాంరెడ్డి, శ్రీనివాస్, సత్యం, పెద్దన్న, గోవర్ధన్ రెడ్డి , చంద్రకళ మేడం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# భూగర్భ డ్రైనేజీ ప్రారంభం

- పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి

**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సాయి గణేష్ నగర్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. ఆదివారం పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సాయి గణేష్నగర్ కాలనీలో దాదాపు 45 మీటర్ల భూగర్భ డ్రైనేజీ అంచనా వ్యయం ఒక లక్ష ఇరవై వేలతో నిర్మించిన దానిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధిలో సహకారం ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దతలు వెంకట్ రెడ్డి, నరేష్, ప్రశాంత్, నాగమల్లు, సాయికుమార్, ఆనంద్ లను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, నాయకులు నల్లా వెల్లి శేఖర్ ముదిరాజ్, కృష్ణా నాయక్, భారత్, శ్రీను, బుచ్చి రెడ్డి, కరుణాకర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.





## క్షీర సాగర్ లో ముగిసిన క్రీడా పోటీలు

- బహుమతులు అందజేసిన : మహేందర్




**జయభేరి, సెప్టెంబర్ 29:**

యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని క్షీరసాగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆదాస్ మహేందర్ పేర్కొన్నారు. ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో మహేందర్ బలిపురం నవీన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఆనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేసారు. ఇందులో భాగంగా మొదటి బహుమతిగా 7 వేల రూపాయలు, రన్నర్ టీమ్ కు గానూ 3 వేల బహుమతి, కప్పు మెడల్స్ అందచేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని సూచించారు. క్రీడలతో స్నేహ సంబంధాలను బలోపేతం చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా క్రీడలపై ఆసక్తి కనబరచాలని పేర్కొన్నారు.




## పరిష్కారం చూపండి ఆందోళనలు ఆపేస్తం..

- భూ నిర్వాహితుల 7వ రోజుకు చేరిన ఆందోళన



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 29 :**

వర్గల్ మండల కేంద్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల వద్ద నిర్వహిస్తున్న ఆందోళన ఆదివారానికి ఏడవ రోజుకు చేరుకుంది. భూ నిర్వాసితుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వేలు నిర్వహించి పరిహారాన్ని అందించాలని కోరారు. సమస్యలపై స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కంపెనీ నిర్మాణాలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, ఉప్పరి గోపాల్, ఉప్పరి శ్రీనివాస్, ఇబ్రహీం, కుమ్మరి శీను ,అంజయ్యతో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.

# మూవీభేరి

## 700 మంది డ్యాన్సర్లతో పాట

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. 'పుష్ప' 'యానిమల్' చిత్రాలతో ఆమె హిందీ బెల్ట్‌లో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం రష్మిక మందన్న చారిత్రక చిత్రం 'ఛావా'లో నటిస్తున్నది. విక్కీ కౌశల్ కథానాయకుడు. ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ జీవిత కథ ఆధారంగా, ఆయన మొఘల్స్‌పై చేసిన అసామాన పోరాటం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భారీ వ్యయంతో రూపొందిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలోని ఓ పాటను 700 మంది డ్యాన్సర్లతో తెరకెక్కించబోతున్నారని తెలిసింది. శంభాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడయ్యే సందర్భంలో వచ్చే ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. 16వ శతాబ్దం నాటి సంగీత వాయిద్యాలతో మరాఠీ జానపద శైలిలో ఏ.ఆర్.రెహమన్ ట్యూన్ సిద్ధం చేశారని తెలిసింది. మహారాష్ట్రలోని రాయ్‌ఘడ్ కోటలో ఈ పాటను చిత్రీకరించబోతున్నారు. 700 మంది డ్యాన్సర్లు, 1000 మందికిపైగా జూనియర్ ఆర్టిస్టులతో ఈ పాటను కన్నులపండువగా తీర్చిదిద్దబోతున్నామని దర్శకుడు లక్ష్మణ్ ఊటేకర్ చెప్పారు. ఇందులో కథానాయిక రష్మిక మందన్న నృత్యాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని అన్నారు. శివాజీ సావంత్ రాసిన 'ఛావా' నవల ఆధారంగా అదే పేరుతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది.





## దోస్త్ మేరా దోస్త్.. ఇసుక తిన్నెల్లో...

సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసే అతి కొద్ది మంది భామల్లో టాప్‌లో ఉంటుంది దిశాపటానీ. ఈ భామ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేదు. బ్రహ్మాస్త్ర లాంటి భారీ ప్రాజెక్టుతో బిగ్ స్క్రీన్‌పై మెరిసింది టీవీ నటి మౌనీరాయ్. ఈ ఇద్దరు ముద్దుగుమ్మలు ప్రకృతి ఒడిలో సేద తీరుతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. సూర్యతాపంలో బీచ్‌లోని ఇసుక తిన్నెల్లో ఒకరి చేయి మరొకరు పట్టుకుని చిల్ అవుట్ అయ్యారు. దిశా పటానీ బర్త్ డే విషెస్ తెలియజేస్తూ.. నా ప్రకాశవంతమైన స్టార్ మోంజు (మౌనీరాయ్)కోసం ఎప్పటికీ గుర్తుండిపోయే సంతోషకరమైన పుట్టినరోజు. నా జీవితంలో చాలా ఆనందాన్ని తెచ్చినందుకు ధన్యవాదాలు. నా సోదరి ప్రేమతో.. అని క్యాప్షన్ పెట్టింది. దీనికి మౌనీరాయ్ స్పందిస్తూ.. నువ్వు చేసే ప్రతి పనికి కృతజ్ఞతలు.. నా లిటిల్ వన్ అంటూ రిప్లై ఇచ్చింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. దిశా పటానీ ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ యాక్టర్ సూర్య నటిస్తోన్న కంగువలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం నవంబర్ 14న విడుదల కానుంది. మరోవైపు వెల్ కమ్ టు ది జంగిల్‌లో నటిస్తోంది. మౌనీ రాయ్ ప్రస్తుతం The GIN Tree లో నటిస్తోంది.



## అరుదైన గౌరవం

'ఆర్ఆర్ఆర్' సినిమాతో ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రామ్‌చరణ్. త్వరలో ఆయనకు మరో గొప్ప గౌరవం కూడా దక్కబోతున్నది. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం వారు రామ్‌చరణ్ మైనపు బొమ్మను ఏర్పాటు చేయబోతున్నారు. చరణ్‌తోపాటు ఆయన పెంపుడు శునకం రైమీ కూడా ఈ విగ్రహంలో భాగం కావటం విశేషం. దీనికి సంబంధించిన ఫొటోషూట్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే ఈ విగ్రహాన్ని రూపొందించి, ఆవిష్కరిస్తామని ఐఫా వేదికగా టూస్సాడ్స్ టీమ్ ప్రకటించింది. టూస్సాడ్స్ కుటుంబంలో తానూ భాగం కావడం గౌరవంగా భావిస్తున్నానని రామ్‌చరణ్ అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. స్టార్ హీరోల మైనపు బొమ్మలను ఇతర దేశాల మ్యూజియమ్స్‌లో ఏర్పాటు చేయడం తరచుగా జరుగుతున్న విషయమే. బాలీవుడ్‌లో అమితాబ్ దగ్గర్నుంచి ఖాన్స్ త్రయం, హృతిక్ రోషన్.. ఇలా చాలామంది మైనపు బొమ్మలను ఇతర దేశాల మ్యూజియమ్స్‌లో ఏర్పాటు చేశారు. తెలుగు హీరోల్లో ఆ గౌరవాన్ని దక్కించుకున్న హీరోల్లో మహేశ్‌బాబు, ప్రభాస్, అల్లు అర్జున్ ఉన్నారు. ఇప్పుడు వారి సరసన రామ్‌చరణ్ కూడా చేరబోతున్నారు.

## రొమాంటిక్ హీరోగా..?

బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తెరంగేట్రానికి రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ తొలి చిత్రం తెరకెక్కనుంది. అయితే.. ఇది ఏ తరహా సినిమా అనేది అభిమానుల్లో నెలకొని ఉన్న ప్రశ్న. సాధారణంగా నందమూరి అభిమానులు మాస్ సినిమాలనే ఎక్కువగా ఇష్టపడతారు. మరి మోక్షజ్ఞని ప్రశాంత్‌వర్మ మాస్ అవతార్‌లోనే ప్రజెంట్ చేస్తున్నాడా?.. అంటే.. ఫిల్మ్ వర్గాలు కాదనే చెబుతున్నాయి.

ఈ సినిమాలో మోస్ట్ రొమాంటిక్‌గా మోక్షజ్ఞని చూపించబోతున్నారట ప్రశాంత్‌వర్మ. అందుకు తగ్గట్టుగా రొమాంటిక్ లవ్‌స్టోరీనే ఆయన ఎంచుకున్నారట. ఈ సినిమాలోని ఓ ప్రత్యేక పాత్రలో బాలకృష్ణగానీ, కల్యాణ్‌రామ్‌గానీ నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందులో హీరోయిన్‌గా ముందు శ్రీలీల పేరు వినిపించింది. కానీ.. దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఆలోచన మాత్రం వేరేలా ఉందట. కచ్చితంగా హిట్ కొట్టాలనే తలంపుతో.. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌కి ఎక్కువ సమయం తీసుకుంటున్నారు ప్రశాంత్‌వర్మ. దసరా రోజున ఈ సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ షూటింగ్‌కి మాత్రం టైమ్ పట్టేలా ఉందని సమాచారం.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com